క్లుప్తంగా

ఘనంగా మహానంది వార్షికోత్సవం



సిరసపల్లిలో మహానందిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లిలో ఆదివారం మహానంది వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వీరభద్ర స్వామి ఆలయం ప్రాంగణంలోని మహానందిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. శ్రీ వీరభద్ర ఎవర్‌గ్రీన్ క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు.

25న మండల పరిషత్ సమావేశం

మునగపాక : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25న జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ హాలులో జరిగే సమావేశానికి ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆకట్టుకున్న రంగవల్లికలు



కోటవురట్లలో రంగవల్లికలతో విద్యార్థులు

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని టాలెంట్‌ను చూపిస్తున్నారు. ఆదివారం విద్యార్థినులకు రంగవల్లికల పోటీ నిర్వహించగా ప్రతిభను చాటారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయానికి స్టీల్ కంచాల వితరణ



అయ్యప్పస్వామి ఆలయానికి స్టీల్ కంచాలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్న భిక్ష కార్యక్రమానికి తమవంతు సాయంగా పెంటకోట తాతారావు భార్య అప్పలనరసమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆదివారం 60 స్టీల్ కంచాలు వితరణగా అందజేశారు.

ట్రస్టు సేవలు భేష్



నిత్యావసర సరకులు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : ఎంవీఆర్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ముత్యాల సతీష్, రాజేష్ కోరారు. మునగపాకలో ఆదివారం మహిళా సమ్మేళనం పేరుతో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు నిత్యావసర సరకులను అందజేశారు. తీర్థయాత్రలకు ఎంతోమందిని పలు దేవాలయాల సందర్శనకు ట్రస్ట్ ద్వారా పంపడం సంతోషకరమన్నారు.

జగనన్నకు మళ్లీ పట్టం కట్టండి



హరిపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ధూళి అప్పారావు

రాంబిల్లి : సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్న జననేత జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని హరిపురం సచివాలయ కన్వీనర్ ధూళి అప్పారావు(బుజ్జి) అన్నారు. ఆదివారం హరిపురం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల హామీలను అమలు చేసిన జగనన్నకు అండగా నిలవాలన్నారు.

ఇది కదా అభివృద్ధి — మన బడి నాడు-నేడు

బడి.. నూతన ఒరవడి



నా పేరు మేరుగు అపర్ణ కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్నాను. నాకు నిహారిక (ఆరోతరగతి), దీప్తి (నాలుగోతరగతి)కుమార్తెలు ఉన్నారు. గతంలో ఇద్దరినీ ప్రైవేట్ స్కూల్లో చదివించేదానిని. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చింది. దీంతో పిల్లలిద్దరినీ నేను పని చేసే ప్రభుత్వ పాఠశాలల్లోనే అడ్మిట్ చేశాను. వారు చక్కగా చదువుతున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంకల్పంతో ఇపుడు అందరికీ నాణ్యమైన విద్య ఉచితంగానే లభిస్తోంది.

ఒకప్పుడు చెట్ల కింద చదువులు..షెడ్ల లాంటి తరగతి గదులు, చాలీచాలని బల్లలు, కూలడానికి సిద్ధంగా ఉండే ప్రహరీ, తుప్పలతో నిండిన ఆవరణ, దుర్గంధం వ్యాపించే టాయిలెట్లు...అకడమిక్ సంవత్సరం పూర్తవుతున్నా అందని పుస్తకాలు..ప్రభుత్వ పాఠశాలల దుస్థితికి నిదర్శనంలా ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. ఆధునిక హంగులతో మౌలిక సదుపాయాలు సమకూర్చింది. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది.

- నాడు-నేడుతో నాణ్యమైన విద్య
- రూపురేఖలు మారిన ప్రభుత్వ పాఠశాలలు
- రూ.18.85 కోట్లతో అభివృద్ధి పనులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): చదువే మన పిల్లలకు ఇచ్చే ఆస్తి.. చదువే అన్నింటికి మూలం.. చదువుకుంటే చాలు తనను తాను, కుటుంబాన్ని మార్చివేయగల శక్తి దాని సొంతం. ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో నాడు-నేడు 1,2 దశల్లో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దే. నేడు అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విదేశీ విద్యా దీవెన,వసతి దీవెన,ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విద్యను బలోపేతం చేస్తున్నారు సీఎం జగన్. సాంకేతిక యుగంలో ప్రభుత్వ పాఠశాలల పిల్లలు ముందుండాలన్న ఉద్దేశ్యంతో బైజూస్ లాంటి సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ట్యాబ్‌లు అందజేశారు. మండలంలో 39 పాఠశాలలు 5 అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నాడు -నేడులో అభివద్ధి పనులు చేశారు.

నాడు-నేడు మొదటి దశలో...

- మండలంలోని ఏటికొప్పాక, కొత్తపేట, యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలు, పేటబయ్యవరం, పెదపల్లి, జంపపాలెం, కె.పురుషోత్తపురం, కొక్కిరాపల్లి, కొత్తలి, రుక్మిణీపురం, కృష్ణాపురం, రేగుపాలెం, పులపర్తి, ఆచాళ్లపాలెం, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలు అభివృద్ధి చేశారు.

రెండో విడతలో..

- మరో 22 హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, కూర్చునే బల్లలు, తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు.



యలమంచిలి బాలికోన్నత పాఠశాలలో బోధన

- గదుల కొరత ఉన్న యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పులపర్తి, ఏటికొప్పాక, జంపపాలెం, కె.పురుషోత్తపురం, కొత్తపేట రేగుపాలెం, సోమలింగపాలెం, తులసీనగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏఎస్‌ఆర్ కాలనీ, మెట్టపాలెం, తెరువుపల్లి, తులసీనగర్ 1, ప్రాథమిక పాఠశాలలు, పెదపల్లి, ప్రాథమికోన్నత పాఠశాలలకు అదనపు గదుల నిర్మాణం కోసం రూ.6.29 కోట్లు మంజూరుతో పనులు తుది దశకు చేరాయి.
- యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.1.10 కోట్లతో ఆధునికీకరణ పనులు త్వరలో పూర్తి కానున్నాయి.
- తల్లిదండ్రుల కమిటీ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో అవినీతికి తావు లేకుండా పనులు పూర్తయ్యాయి.

మండలంలో మొత్తం పాఠశాలలు	51
మొదటి విడత అభివృద్ధి పరిచిన పాఠశాలలు	17
ఖర్చు చేసిన నిధులు	రూ. 4.80 కోట్లు
రెండో విడత అభివృద్ధి చేసిన పాఠశాలలు	27
ఖర్చు చేసిన నిధులు	రూ. 12.95 కోట్లు

వీటితో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని హైస్కూళ్లకు తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్) లను ఏర్పాటు చేశారు.



యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

మా బడి బాగుంది...



మేము యలమంచిలి కొత్తపేట హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాం. గతంలో మా బడి కూలిపోయే దుస్థితిలో ఉండేది. జగన్ మామ అభివృద్ధి చేయడంతో మా బడి చాలా బాగుంది. కూర్చోవడానికి బల్లలు చక్కగా ఉన్నాయి. జగనన్న గోరుముద్ద భోజనం చాలా రుచిగా ఉంటుంది. ఐఎఫ్‌పీల ద్వారా మా ఉపాధ్యాయులు చక్కగా చదువు చెబుతున్నారు. మేమంతా మూడేళ్ల క్రితం యలమంచిలిలో ప్రైవేట్ స్కూళ్లలో చదివే వాళ్లం. ప్రభుత్వం ఈ స్కూల్లో సౌకర్యాలు కల్పించడంతో ప్రైవేట్ స్కూళ్ల నుండి ఇక్కడకు వచ్చి చేరాం. ప్రైవేట్ స్కూళ్లలో చదువు బాగా ఒత్తిడితో కూడి ఉండేది. ఇక్కడ చదువుతో పాటు ఆట, పాటలు, ఇతర సాంస్కృతిక అంశాలు కూడా ఉండడంతో ఒత్తిడి అనిపించడం లేదు.

– విద్యార్థినులు ఐ.పూజిత, ఆర్.ఉష్రశ్రీ. జి.భవ్య సహస్ర,



యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్



కార్పొరేట్ హంగులు అద్దుకున్న కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల



కొత్తపేట హైస్కూల్లో విద్యార్థుల కోసం నిర్మించిన టాయిలెట్స్

ఆలయాల అభివృద్ధికి కృషి



షేకాళ్లపాలెంలో తలుపులమ్మ తల్లి గుడికి శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ గోవింద్

యలమంచిలి : గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఆదివారం మండలంలో షేకాళీపాలెం గ్రామంలో తలుపులమ్మతల్లి ఆలయం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులంతా భక్తిభావాలు అలవర్చుకోవాలన్నారు. గుడి నిర్మాణానికి ఆర్థికంగా చేయూత అందించాలని, అలాగే గ్రామాభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల రాజు, మాజీ సర్పంచ్ మరిసా అప్పారావు, గ్రామ పెద్దలు వరహాలు, సత్తిబాబు, జోగారావు, అప్పారావు, కొక్కిరాపల్లి మాజీ సర్పంచ్ పాలరౌతు నర్సింగరావు, తురంగలపాలెం సర్పంచ్ చందక శంకర్, రిటైర్డ్ వీఆర్‌వో సత్యనారాయణ, భీముని అప్పారావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గాప్రసాద్ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా హక్కులను కాపాడుకోవాలన్నారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి ఎల్.వి.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రణతి స్కూల్ ఉపాధ్యాయులు ఆశాదేవి, ఉపాధ్యాయులు పిల్లా జగదీష్, బి.గణేష్ కుమార్, విశ్రాంత ఉపాధ్యాయుడు తులసీరావు పాల్గొన్నారు.

ఘనంగా ముసిలితల్లి అమ్మవారి పండగ



కోలాటం ఆడుతున్న దృశ్యం



అమ్మవారికి బండిపై నైవేద్యం తరలిస్తున్న దృశ్యం

మునగపాక : అరబుపాలెం గ్రామంలో ఆదివారం ముసిలితల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. రెండేళ్లకోసారి వచ్చే పండగను గ్రామస్తులంతా భాగస్వాములై ఉత్సాహంగా జరుపుకొన్నారు. తిమ్మరాజుపేటకు చెందిన కళాకారులతో ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అమ్మవారికి బండిపై నైవేద్యాన్ని ఆలయానికి తరలించి అమ్మవారికి సమర్పించారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ హైమావతి, ఆలయ చైర్మన్ గంగాధర్, కార్యదర్శి లక్ష్మణరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. లైబ్రేరియన్ ఎస్.శకుంతలతో పాటు పలువురు మహిళలు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.



దిమిలి గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ.లక్ష వితరణ



ఆలయ నిర్మాణం కోసం రూ.లక్ష చెక్కు అందజేస్తున్న అప్పలనాయుడు

మునగపాక : మునగపాకలో నిర్మాణం చేపట్టనున్న కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వ్యాపారి ఆడారి అప్పలనాయుడు(చుట్టుకొట్టు) ఆదివారం రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ చెక్కును వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో దాతలు భాగస్వాములు కావాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రాము పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బొలిశెట్టి

ఎస్.రాయవరం : గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత నెలకొంటుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో అభయాంజనేయ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దాతల విరాళాలతో ఆలయ పైకప్పు పనులు పూర్తి చేసిన అనంతరం ఆలయం ప్రారంభోత్సవం చేశారు.

జెట్టీ నిర్మాణంతో మత్స్యకారులకు ఎంతో మేలు



పూడిమడక జెట్టీ రోడ్డు నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): పూడిమడక జెట్టీ నిర్మాణం పూర్తి అయితే జిల్లాలోని మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో నిర్మించనున్న జెట్టీకి చేరుకునేందుకు అవసరమైన రహదారి ఏర్పాటుకు ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని, రమణ దంపతులు భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలోనే జెట్టీల ప్రతిపాదన వచ్చిందని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ ప్రతిపాదనను అటకెక్కించగా, మళ్లీ సీఎం జగన్ వచ్చిన తర్వాత పూడిమడక జెట్టీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ జెట్టీ నిర్మాణం పూర్తి అయితే పూడిమడకలో ఉపాధి సమస్య ఉండదని పేర్కొన్నారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో-ఆప్షన్ జెడ్పీటీసీ సర్మాల కుమార్, కోన లచ్చన్నాయుడు, వానపల్లి శ్రీనివాసరావు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకు ఘన నివాళులు



ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పాయకరావుపేట : దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెసు పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు పార్టీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఎం.సింహాచలం, పి.అప్పలరాజు, గారా సూర్యారావు పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్థానిక గ్రంథాలయంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాధవి, ఎంపీటీసీ గుల్లా దివ్య, తెలుగు ఉపాధ్యాయులు ఎం.శ్యామల, గ్రామ సచివాలయ మహిళా పోలీసు తోట వెంకట సాయి షర్మిష్మా, డ్వాక్రా బీవో మల్లేశ్వరులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి లక్ష్మణరావు, నాయకులు జగతా శ్రీను, ధనిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.



ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న మహిళలు



చినదొడ్డిగల్లులో ఇందిర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి: చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఆదివారం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ కె.జనార్దన్ ఆధ్వర్యంలో ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో బడుగు బలహీన వర్గాల కోసం ఇందిరాగాంధీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు బ్యాంకులను జాతీయాకరణ చేశారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఆవ ప్రాంతంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మునగపాక : వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా ఇక్కడకు చేరుకొని సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యాభ్యాసం నాటి మధుర స్మృతులు నెమరువేసుకున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు పూర్వ విద్యార్థులు స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు. రాము, సూర్యనారాయణ, మంత్రి శ్రీను, కర్రి ప్రసాద్, సన్యాసిరావు, జోగినాయుడు, గోపి ఈ ఆత్మీయ సమ్మేళనానికి నేతృత్వం వహించారు.